సాక్షి
జోగులాంబ గద్వాల

మంగళవారం। 22। ఏప్రిల్। 2025



పేద విద్యార్థులకు చేయూత

వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పేద విద్యార్థులకు ఉచిత శిక్షణ చేయూతనిస్తోంది.

వివరాలు 8లో ▸



లభించని కార్మికుల ఆచూకీ

ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో గల్లంతైన ఆరుగురి కార్మికుల జాడ లభించడం లేదు.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.9 /23.2

వాతావరణం

ఉదయం, సాయంత్రం ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత, ఉక్కపోత పెరుగుతుంది.

● ఇసుకాసుర 'హస్తం'..!

నదిలో రోడ్డేసి.. దర్జాగా తవ్వేసి



మక్తల్ నియోజకవర్గ పరిధి టైరోడ్డు సమీపంలోని ఓ మఠం వద్ద కృష్ణానదిలో తొలుత వేసిన రోడ్డు ఇది..



మళ్లీ కొన్ని రోజుల తర్వాత మఠం నుంచి దాదాపు రెండు కి.మీ.ల దూరంలో ఏడెనిమిది కిలోమీటర్ల మేర నదిలో వేసిన మరో రోడ్డు ఇది..

...తెలంగాణ-కర్ణాటక రాష్ట్ర సరిహద్దు నారాయణపేట జిల్లాలోని కృష్ణా పరివాహకంలో ఇసుక మాఫియా ఆగడాలకు ఇవి నిదర్శనం. నదిలో మట్టి రోడ్లు వేసి మరి తెలంగాణ పరిధిలోని ఇసుకను కర్ణాటకకు తరలిస్తున్నారు. పగలు, రాత్రనక యథేచ్ఛగా దందా కొనసాగుతున్నా.. రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్, పోలీస్ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడం అనుమానాలకు తావిస్తోంది.

- సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్

కృష్ణా పరివాహకంలో యథేచ్ఛగా ఇసుక దందా

- నారాయణపేట జిల్లాలో పేట్రేగుతున్న ఇసుక మాఫియా
- జేసీబీ, హిటాచీల వంటి భారీ యంత్రాలతో తవ్వకాలు
- 2 చోట్ల రోడ్డు వేసి పగలు, రాత్రనక బెంజ్ వాహనాల్లో రవాణా
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు
- ఫిర్యాదులు వచ్చినప్పుడే తనిఖీల పర్వం
- తూతూమంత్రపు కేసులతో సరిపెడుతున్న ఖాకీలు
- ఓ రాజకీయ నేత 'హస్తం' ఉన్నట్లు ఆరోపణలు

తొలుత 8 కి.మీ.ల మేర మట్టి రోడ్డు..

ఉమ్మడి పాలమూరు.. ప్రస్తుత నారాయణపేట జిల్లా కృష్ణా మండలంలో తంగిడి వద్ద కృష్ణానది ప్రవేశిస్తోంది. ఈ మండల పరిధి టైరోడ్ సమీపంలో కృష్ణా పరివాహకంలోని ఓ ఆశ్రమం వద్ద మాఫియా ఆధ్వర్యంలో నదిలో తొలుత ఏడెనిమిది కిలోమీటర్ల మేర మట్టి రోడ్డు నిర్మించింది. నదిలో ఊట నీరు లేదంటే వరద వచ్చినా.. ఇబ్బందుల్లేకుండా అక్కడక్కడ చిన్న చిన్న తూములను ఏర్పాటు చేసి మట్టి రోడ్డు వేశారు. ప్రస్తుతం నదిలో ఇసుక మేటలు పెద్ద ఎత్తున తేలగా.. ఆ ప్రాంతంలో హిటాచీ, జేసీబీల వంటి భారీ యంత్రాలతో తవ్వి.. ఈ మట్టి రోడ్డు గుండా బెంజ్‌లు, టిప్పర్ల ద్వారా పగలు, రాత్రనక కర్ణాటకకు తరలిస్తున్నారు.

ఆ తర్వాత వేరే చోట..

తొలుత మట్టి రోడ్డు వేసి బెంజ్ వంటి వాహనాల్లో ఇసుక తరలించడంపై పలువురు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో రెవెన్యూ, పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇసుక తరలిస్తున్న వాహనాలపై పోలీసులు తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. ఆ తర్వాత ఎవరు కూడా అటు వైపు చూడకపోవడంతో ఇసుక మాఫియా రాత్రిళ్లు యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇదే క్రమంలో అదే ఆశ్రమం నుంచి కొద్దిదూరంలో వేరే చోట మట్టి రోడ్డు వేసి.. భారీ ఎత్తున తవ్వకాలు చేపడుతోంది. రోజుకు వందలాది ట్రిప్పుల చొప్పున ఇసుకను కర్ణాటకలోని తదితర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటోంది. బెంజ్ ఇసుకను రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.



ఓంకారేశ్వర మఠం సమీపంలో కృష్ణానది తీరంలో మొదట వేసిన రోడ్డులో రాత్రి వేళలో ఇసుక తవ్వకాలు

దందా వెనుక ఎవరి 'హస్తమో'?

కృష్ణా పరివాహకంలో అక్రమార్కులు ఎలాంటి అనుమతులు లేకుండా నదిలో రోడ్డు వేసినా.. రాత్రిళ్లు ఇసుక రవాణా కొనసాగుతున్నా.. పోలీస్, రెవెన్యూ, మైనింగ్, ఇరిగేషన్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ దందా వెనుక పేట జిల్లాకు చెందిన ఓ 'అధికార' నేత హస్తం ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కృష్ణా మండలానికి చెందిన ఓ నాయకుడు చక్రం తిప్పుతున్నట్లు సమాచారం.

సమన్వయ లేమినా.. ముడుపులు అందడంతోనా..

ఇసుక దందాను అరికట్టడంలో భాగంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నారాయణ జిల్లా అధికార యంత్రాంగం ఇదివరకే టాస్క్‌ఫోర్స్ కమిటీ వేసింది. ఇందులో రెవెన్యూ, భూగర్భ జల, ఇరిగేషన్, పోలీస్, ఆర్టీఏ అధికారులు ఉన్నారు. వీరందరూ ఐక్య కార్యాచరణతో ఇసుక మాఫియా ఆగడాలకు చెక్ పెట్టాల్సి ఉంది. కానీ.. జిల్లాలో ఆయా శాఖల మధ్య సమన్వయం కొరవడినట్లు తెలుస్తోంది. మరో వైపు ఆయా శాఖల అధికారులు పొంతన లేని సమాధానాలు చెబుతుండడం అనుమానాలకు తావిస్తోంది. నెలనెలా శాఖల వారీగా ముడుపులు అందుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా నదిలో రోడ్డు వేస్తే చర్యలు తీసుకోరా.. రాత్రిళ్లు తవ్వకాలు చేపట్టొచ్చా? అని 'సాక్షి' వివిధ విభాగాల అధికారులను సంప్రదించగా..మా బాధ్యత కాదు అంటూ ముక్తసరిగా సమాధానం ఇవ్వడం గమనార్హం.

అధికారులు పట్టించుకోవాలి..



కృష్ణా నది నుంచి ఇసుక తరలించడం మూలంగా సాగు నీటికి ఇబ్బందులు ఏర్పడుతాయి. దీంతోపాటు నదిలో రోడ్లు వేయడం వల్ల దిగువకు నీళ్లు రాకుండా పోతున్నాయి. ఉన్న కాస్త నీరు అక్కడే నిలుస్తోంది. పరిస్థితి ఇలా ఉంటే వేసవి చివరలో నీటి కొరత తీవ్రమయ్యే అవకాశం ఉంది. అధికారులు పట్టించుకోవాలి.

- అంబ్రేష్, మాజీ సర్పంచ్, గుడెబల్లూరు, కృష్ణా

నా దృష్టికి రాలేదు..



నది రోడ్లు వేసినట్లు నా దృష్టికి రాలేదు. త్వరలో ఆకస్మిక తనిఖీలు చేపడతాం. నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేపట్టినా.. అనుమతుల్లేకుండా తరలిస్తున్నా.. చర్యలు తప్పవు.

- వెంకటేష్, తహసీల్దార్, కృష్ణా

ఇరిగేషన్ శాఖ దృష్టికి తీసుకెళ్లా..

మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాలో మైనింగ్ సిబ్బంది కొరత ఉంది. అయినా నదిలో రోడ్డు వేసినట్లు మా దృష్టికి వచ్చిన వెంటనే.. పరిశీలించాలని సిబ్బందిని పంపించా. నీటిని మళ్లించేందుకు రైతులు వేసుకున్నట్లు చెప్పారు. ఈ అంశాన్ని ఇరిగేషన్ శాఖ దృష్టికి తీసుకెళ్లా. చర్యలు తీసుకోవాల్సింది వారు.

- సంజయ్, ఏడీ, మైనింగ్ శాఖ, మహబూబ్‌నగర్

'ఎత్తిపోతల'పై ప్రభావం..

కృష్ణానది ఆధారంగా మక్తల్ నియోజకవర్గంలో కుసుమూర్తి, వాసునగర్, గూడెబల్లూరు, ముడుమాల్, కొల్పూరు, పారేవుల, పస్పుల మినీ ఎత్తిపోతల పథకాలు పనిచేస్తున్నాయి. వీటి ద్వారా దాదాపు 20 వేల ఎకరాలకు సాగు నీరందుతోంది. పలు ఎత్తిపోతల ద్వారా మే నెల వరకు తాగునీటి అవసరాలు తీర్చాల్సి ఉంది. ప్రస్తుతం రబీ సీజన్ ముగిసింది. దీంతో పంటలకు అంతగా నీటి అవసరం లేకున్నా.. ప్రతి ఏటా ఇసుక తవ్వకాలు చేపడుతుండడంతో పంటల సాగుపై ప్రభావం చూపడంతో పాటు తాగు నీటికి ఇబ్బందులు వస్తాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సర్వేలతోనే.. సాగదీత

2021లో ర్యాలంపాడు జలాశయానికి గండి.. పలుచోట్ల లీకేజీలు

- ఇదివరకే రెండుమార్లు ఇంజినీరింగ్ నిపుణుల బృందం సందర్శన
- మరమ్మతుకు రూ.137 కోట్లతో అంచనాల నివేదిక
- మంజూరుకు నోచుకోక మూలకు చేరిన ప్రతిపాదనలు
- తాజాగా పుణెకు చెందిన నిపుణుల కమిటీ పరిశీలన

గద్వాల: అన్నదాతలకు మేలు చేకూర్చాలనే సంకల్పంతో రూ.కోట్లాది నిధులతో చేపట్టిన ఇరిగేషన్ ప్రాజెక్టులు అందుకు భిన్నంగా అవినీతిపరుల సొంత ఖజానా నింపుకొనేందుకు ఉపయోగపడ్డాయనే దానికి నిలువుటద్దంగా నిలుస్తోంది ర్యాలంపాడు జలాశయం. సుమారు రూ.300 కోట్లతో చేపట్టిన ర్యాలంపాడు జలాశయం పట్టుమని ఏడాది కూడా నిలవకుండా గండిపడింది. నెట్టెంపాడు ప్రాజెక్టులో కీలకమైన ర్యాలంపాడు రిజర్వాయర్ పనులు పూర్తయిన తర్వాత మొదటిసారి 2021లో పూర్తిస్థాయి (4 టీఎంసీలు) నీటిని నింపారు. అయితే అదే ఏడాది రిజర్వాయర్‌లో పలుచోట్ల ఆనకట్ట రాక్ టోల్, ఎడమ, కుడి వెంట్లు, అడుగు భాగాల వద్ద లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో రూ.1,450 కోట్ల వ్యయంతో గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల పరిధిలోని 2 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించాలని నెట్టెంపాడు ప్రాజెక్టు లక్ష్యం కాస్త మట్టిలో కొట్టుకుపోయింది.



ర్యాలంపాడు జలాశయం

ఏడాదిలోపే ప్రమాదం

వరద జలాలను వినియోగించుకునేలా నెట్టెంపాడు ప్రాజెక్టులో 7 జలాశయాలు నిర్మించారు. ఇందులో కీలకమైన ర్యాలంపాడు రిజర్వాయర్‌ను సుమారు రూ.300 కోట్లతో 4 టీఎంసీల నీటిని నిల్వ ఉంచుకునేలా నిర్మించారు. ఈ జలాశయం కింద 1.05 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇంతటి ప్రాధాన్యత, ప్రత్యేకత గల ర్యాలంపాడును లోపభూయిష్టంగా నిర్మించడంతోపాటు అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఐదేళ్ల కిందట ఏకంగా జలాశయం మొత్తానికే ముప్పు ఏర్పడింది. రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటిని నిల్వ చేసిన ఏడాదిలోపే జలాశయం అడుగు భాగాన రాక్ టోల్, ఎడమ, కుడి వెంట్ నిర్మాణాలు, ఆనకట్టపై భాగం పలుచోట్ల లీకేజీలు ఏర్పడి నీరు బయటకు ఉబికి వస్తున్నాయి.

జలయజ్ఞం ప్రాజెక్టులపై సమీక్ష

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జలయజ్ఞం ప్రాజెక్టులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ర్యాలంపాడు జలాశయం లీకేజీలపై ప్రత్యేకంగా చర్చ జరగగా.. మరమ్మతుకు అవసరమైన చర్యలు చేపట్టాలని నిర్ణయించినా ఎలాంటి పురోగతి లేకపోయింది.

నిర్ఘాంతపోయిన అధికారులు

రిజర్వాయర్‌కు ఏర్పడిన లీకేజీలను చూసి అధికారులు మొదట్లో నిర్ఘాంతపోయారు. వీటిపై అధ్యయనం చేసేందుకు ఇరిగేషన్ శాఖకు చెందిన సీఈ స్థాయిలో నిపుణుల కమిటీ 2022లో జలాశయాన్ని సందర్శించింది. ఎక్కడెక్కడ లీకేజీలు ఏర్పడ్డాయి.. ఇందుకు గల కారణాలు గుర్తించారు. సర్వే పనులు, జలాశయాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన ఓ సంస్థకు అప్పగించింది. ఇందుకోసం రూ.57 లక్షలు వెచ్చించింది. పనులు దక్కించుకున్న సదరు సంస్థ 2022 మార్చిలో సర్వే చేపట్టి.. లీకేజీల మరమ్మతుకు సుమారు రూ.137 కోట్ల అంచనాలతో తుది నివేదికను 2023 ఫిబ్రవరిలో ప్రభుత్వానికి సమర్పించింది. అయితే అప్పటి ప్రభుత్వం దీనిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం వహించడంతో దస్త్రం మూలకు చేరింది.

■ ఇదిలా ఉండగానే ర్యాలంపాడు లీకేజీలపై ఈ నెల 10న పుణెకు చెందిన సెంట్రల్ వాటర్ కమిషన్ నిపుణుల బృందం సందర్శించింది. ఎడమ, కుడి వైపున్న వెంట్లు, ఆనకట్ట అడుగు భాగాన ఉన్న లీకేజీల ప్రాంతాలను పరిశీలించారు.

ప్రభుత్వ నిర్ణయం మేరకే..



మరమ్మతుకు సంబంధించి నివేదిక హైదరాబాద్‌లోని సీఈ కార్యాలయం టెక్నికల్ విభాగంలో ఉంది. ఇదిలా ఉండగా సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ వారు సీడబ్ల్యూసీ నిపుణులు అభిప్రాయం తీసుకోవాలని సూచించడంతో పుణెకు చెందిన నిపుణుల బృందం ఈ నెల 10న జలాశయాన్ని సందర్శించారు. వీరి నివేదిక అనంతరం ప్రభుత్వం తుది నిర్ణయం మేరకే మరమ్మతు చేపడతాం.

- రహీముద్దీన్ ఎస్‌ఈ ఇరిగేషన్‌శాఖ

న్యూస్‌రీల్

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

గద్వాల క్రైం: జిల్లాలో హోంగార్డులు విధుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. సోమవారం సాయంత్రం ఎస్పీ కార్యాలయంలో సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జోగుళాంబ గద్వాలకు వచ్చిన 53 మంది హోంగార్డులు తమ విధుల నిర్వహణపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సమస్యలపై నిర్భయంగా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కేటాయించిన విధుల్లో పురోగతి సాధించాలన్నారు. సమావేశంలో ఏఆర్ డీఎస్పీ నరేందర్ తదితరులు ఉన్నారు.

కార్మిక సవరణ చట్టాలపై ఉద్యమించాలి



గద్వాల టౌన్: కేంద్ర ప్రభుత్వం కార్మిక సవరణ చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని వాల్మీకి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాల సవరణ ద్వారా ప్రస్తుతం కార్మికులను పెట్టుబడిదారులకు బానిసలుగా మార్చే కుట్ర జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వ కార్మిక సవరణ చట్టాలకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేపడుతున్నామన్నారు. ఈ సమ్మెతో కేంద్ర ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు చెంపపెట్టు కావాలన్నారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు ఆంజనేయులు, హన్మంతు, కృష్ణ, వెంకటస్వామి, నర్సింహ, హలీంపాషా తదితరులు పాల్గొన్నారు.

భూ భారతితో అన్ని సమస్యలకు పరిష్కారం



మాట్లాడుతున్న ఎంపీ మల్లు రవి, పక్కన కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే విజయుడు తదితరులు

అలంపూర్/ ఉండవెల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంతో అన్నిరకాల భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఎంపీ మల్లు రవి అన్నారు. అలంపూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో, ఉండవెల్లిలోని రైతువేదికలో భూ భారతి చట్టంపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సుకు ఎంపీతోపాటు కలెక్టర్ బీఎం సంతోష్, ఎమ్మెల్యే విజయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి రైతు పక్షపాతిగా భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం తీసుకొచ్చారన్నారు. గతంలో ధరణి పోర్టల్‌తో రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, కార్యాలయాల చుట్టు కాళ్లు అరిగేలా తిరిగినా పరిష్కారం చూపేవారు కాదన్నారు. ఈ దుస్థితిని మార్చడానికి, పేద రైతుల కన్నీళ్లను తుడిచేందుకు భూ భారతి చట్టం రూపొందించామన్నారు. ప్రభుత్వం అన్ని కోణాల్లో మేధోమథనం చేసి సమగ్ర అంశాలతో భూ భారతి చట్టానికి రూపకల్పన చేసిందన్నారు. ప్రతి వారం కలెక్టర్, తహసీల్దార్ సహా సంబంధిత అధికారులతో సమీక్ష జరిపి భూ సమస్యల పరిష్కారంపై పర్యవేక్షణ చేస్తామన్నారు. కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ ధరణి స్థానంలో కొత్తగా భూ భారతి వ్యవస్థ అమల్లోకి వచ్చిందని, భూ భారతి చట్టంలో 23 సెక్షన్లు, 18 నిబంధనలు ఉన్నట్లు చెప్పారు. ముందుగా తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకోవచ్చని, అక్కడ న్యాయం జరగకపోతే ఆర్డీఓ, కలెక్టర్‌కు అప్పీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. భూ భారతితో భూమికి సంబంధించిన సమస్యలు జిల్లా స్థాయిలోనే పరిష్కరించుకోవచ్చన్నారు. వారసత్వ మ్యుటేషన్, హక్కుల సంక్రమణ గడువులోపు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. భూమి రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు ముందు తప్పనిసరిగా భూమి సర్వే జరిపించి మ్యాప్ తయారు చేయాల్సి ఉంటుందన్నారు. ఆధార్ తరహాలో భవిష్యత్‌లో భూములకు సంబంధించి సర్వే చేసి, హద్దులు, కొలతలు, భూముల వివరాలు ఒకే పుస్తకంలో ఉండేలా భూధార్ రూపొందించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే విజయుడు మాట్లాడుతూ గ్రామాల ప్రజలు భూ భారతి చట్టంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, ఆర్డీఓ శ్రీనివాసరావు, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాసులు, అలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, తహసీల్దార్ మంజుల, మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి

అలంపూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అలంపూర్ క్షేత్రాన్ని అభివృద్ధి చేస్తానని ఎంపీ మల్లు రవి అన్నారు. సోమవారం ఆయన ఆలయాన్ని సందర్శించగా.. ఆలయ అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం అమ్మ, స్వామివార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శక్తిపీఠం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడతానన్నారు. అలంపూర్ చౌరస్తాలోని వంద పడకల ఆస్పత్రిని ప్రారంభించడానికి కృషి చేస్తానన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతుల జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.

పొగాకు పూర్తిగా కొనుగోలు చేయాలి

అలంపూర్: బీడీ పొగాకును పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న అన్నారు. ఈ మేరకు సోమవారం అలంపూర్‌కు వచ్చిన కలెక్టర్ బీఎం సంతోష్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గ రైతులతో పలు ప్రైవేట్ కంపెనీలు ఒప్పందం చేసుకుని ఈ ఏడాది అధికంగా పొగాకు సాగు చేయించారని, కానీ, ఇప్పుడు పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. నెల రోజులుగా కొనుగోళ్లు నిలిపివేయడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అకాల వర్షాల వల్ల పంట తడిసి నాణ్యత తగ్గి తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై రైతులు పలుమార్లు సదరు కంపెనీల అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోవడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీంతో కలెక్టర్ స్పందించి సంబంధిత కంపెనీల యాజమాన్యాలతో మాట్లాడి పొగాకు కొనుగోలు చేసేలా చూస్తామని హామీ ఇచ్చారన్నారు. కలెక్టర్‌ను కలిసిన నాయకులు దేవదాసు, రాజు, నర్సింహ, రైతులు పాల్గొన్నారు.

వేరుశనగ @ రూ.6,321

గద్వాల వ్యవసాయం: జిల్లాకేంద్రంలోని మార్కెట్ యార్డుకు సోమవారం 432 క్వింటాళ్ల వేరుశనగ రాగా.. గరిష్టంగా రూ.6,321, కనిష్టంగా రూ.3,670 ధరలు పలికాయి. అలాగే 28 క్వింటాళ్ల కంది రాగా.. గరిష్టంగా రూ.6,426, కనిష్టంగా రూ.5,506 ధరలు వచ్చాయి. 178 క్వింటాళ్ల ఆముదాలు రాగా.. గరిష్టంగా రూ.5,981, కనిష్టంగా రూ.5,641, సరాసరిగా రూ.5,949 ధరలు పలికాయి. 1,832 క్వింటాళ్ల సోన) రాగా.. గరిష్టంగా రూ.1,956, కనిష్టంగా రూ.1,703, సరాసరిగా రూ.1,771 చొప్పున వచ్చాయి.

వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ వ్యతిరేకం



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లిం పెద్దలు, వివిధ పార్టీల నాయకులు

గద్వాల టౌన్: కేంద్రం చేపట్టిన వక్ఫ్ సవరణ చట్టం రాజ్యాంగ వ్యతిరేకమని, సంఘటిత ఉద్యమాలతోనే దీన్ని తిప్పికొట్టాలని ముస్లిం మతపెద్దలు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల బాధ్యులు అన్నారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఈద్గా చౌరస్తా నుంచి ప్రధాన రహదారుల వెంట భారీ ర్యాలీ తీశారు. వీరికి ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సరిత, మున్సిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్రాములు, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి, సీపీఐ జిల్లా కార్యదర్శి ఆంజనేయులు, ప్రజా సంఘాల నాయకుడు మోహన్ తదితరులు సంఘీభావం తెలిపి నిరసన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కేవలం ముస్లింలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తుందని విమర్శించారు. వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసే వరకు ఉద్యమాలు కొనసాగిస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు ఆస్తులను కొల్లగొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నిందని ఆరోపించారు. దేశంలో మరో విభజనకు బీజేపీ కుట్ర పన్నుతోందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ నర్సింగరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు అబ్బాస్, ఉస్మాన్, ఫయీమ్, జబ్బార్, ఈద్గా కమిటీ అధ్యక్షుడు ఖలీల్, న్యాయవాది షఫీఉల్లా, అతికుర్ రహమాన్, దౌలత్, సీరాజుద్దీన్, మక్బూల్, ఎక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ భూమి కౌలు వేలం



భూముల కౌలు వేలం నిర్వహిస్తున్న అధికారులు, పాలక మండలి సభ్యులు

అలంపూర్: పట్టణంలోని ఆలయ సముదాయంలో జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామికి చెందిన భూముల వేలాన్ని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అదనపు కమిషనర్ మదనేశ్వర్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించినట్లు ఈఓ పురేందర్‌కుమార్ తెలిపారు. 2025–27 రెండేళ్ల కాల పరిమితితో 34 సర్వే నెంబర్లలో 28 సర్వే నంబర్ల ద్వారా వేలంలో రూ.39.59లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ పేర్కొన్నారు. మిగిలిన 6 సర్వే నంబర్లకు సరైన ధర రాకపోవడంతో మే 2న రెండో సారి కౌలు వేలం నిర్వహిస్తామని తెలిపారు. శ్రీసూర్య నారాయణ స్వామి ఆలయానికి చెందిన 2 సర్వే నంబర్లకు నిర్వహించిన వేలంలో రూ.6.77లక్షలు, కాశీపురం ఆంజనేయస్వామి ఆలయానికి చెందిన 2 సర్వే నంబర్ల భూములకు రూ.2.11 లక్షలు వచ్చినట్లు వెల్లడించారు. ఆలయ చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, ధర్మకర్తలు నాగశిరోమణి, జగదీశ్వర్‌గౌడ్, ఎ.వెంకటేశ్వర్లు, జగన్మోహన్ నాయుడు, జి.వెంకటేశ్వర్లు, గోపాల్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో జీహెచ్‌ఎం దుర్మరణం


శ్రీనివాసులు (ఫైల్)

వెల్దండ/తెలకపల్లి: రోడ్డు ప్రమాదంలో జీహెచ్‌ఎం మృతి చెందిన ఘటన వెల్దండ మండలం పెద్దాపూర్ సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. అచ్చంపేటకు చెందిన పాపిశెట్టి శ్రీనివాసులు (61) తెలకపల్లి పాఠశాలలో జీహెచ్‌ఎంగా విధులు నిర్వర్తిస్తున్నారు. పిల్లల చదువు నిమిత్తం కొంతకాలంగా ఆయన భార్య కమల తమ కుమార్తెతో కలిసి హైదరాబాద్‌లోని మన్నెగూడలో నివాసం ఉంటున్నారు. పాఠశాలకు సెలవులు వచ్చినప్పుడు శ్రీనివాసులు కుటుంబ సభ్యుల వద్దకు వెళ్లి వస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం హైదరాబాద్‌కు వెళ్లిన ఆయన.. సోమవారం కారులో తెలకపల్లి పాఠశాలకు బయలుదేరారు. మార్గమధ్యంలోని పెద్దాపూర్ సమీపంలో కారు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టింది. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్‌ఐ కురుమూర్తి తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. కాగా, జీహెచ్‌ఎం పాపిశెట్టి శ్రీనివాసులు ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందనున్నారు. వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ నెల 17న తెలకపల్లి పాఠశాలలో పదవీ విరమణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థుల నడుమ నిర్వహించారు. రోడ్డు ప్రమాదంలో జీహెచ్‌ఎం మృతితో పాఠశాలలో విషాదఛాయలు అలుముకున్నాయి.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మల్దకల్: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెంది ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం మండలంలోని ఎల్కూరులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఎల్కూరు గ్రామానికి చెందిన వెంకటేష్ (42) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ.. ఈ నెల 17 రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న వెంకటేష్‌ను చికిత్స నిమిత్తం గద్వాల, అక్కడి నుంచి కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య పద్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ పురేందర్ తెలిపారు.

రంపంతో భర్త గొంతు కోసిన భార్య

లింగాల: నిద్రలో ఉన్న భర్త గుండూర్ కురుమయ్య గొంతుపై భార్య చెన్నమ్మ రంపం బ్లేడ్‌తో గాయపర్చిన ఘటన సోమవారం మండలంలోని అవుసలికుంటలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్‌ఐ వెంకటేష్‌గౌడు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 19న భార్య చెన్నమ్మతో కుర్మయ్య గొడవపడ్డారు. అదే రోజు రాత్రి 11 గంటలకు చెన్నమ్మ రంపం బ్లేడ్‌తో ఇంటి ఆవరణలో నిద్రిస్తున్న భర్తపై కుర్మయ్య గొంతు కోసింది. కుర్మయ్య అరుపులు విని పక్క ఇంటిలో ఉన్న అన్న వెంకటయ్య, ఆయన భార్య లక్ష్మి వెళ్లి చెన్నమ్మను పక్కకు తోసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వెంటనే బాధితుడిని 108 అంబులెన్సులో లింగాల ఆస్పత్రికి తీసుకెళ్లారు. డాక్టర్ సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి బలవన్మరణం


మండ్ల రాములు (ఫైల్)

గోపాల్‌పేట: కుటుంబ కలహాలు తట్టుకోలేక వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండల కేంద్రంలోని బండపల్లి కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గోపాల్‌పేటకు చెందిన గిరమ్మ, గోపాల్ దంపతుల పెద్దకుమారుడు మండ్ల రాములు(35)కు 15ఏళ్ల క్రితం నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీపురం గ్రామానికి చెందిన లావణ్యతో పెళ్లయింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో లావణ్య వారి పుట్టింటి వద్దే ఉంటోంది. రాములు అప్పుడప్పుడు భార్య వద్దకు వెళ్లి వస్తుండేవాడు. గొడవల వల్ల జీవితంపై విరక్తి చెందిన రాములు సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని మరణించాడని మృతుడి తల్లి గిరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

పేద విద్యార్థులకు చేయూత


బాలికల జూనియర్ కళాశాలలో ఎంసెట్, ఐఐటీ, నీట్ శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- ఎంసెట్, నీట్‌కు ఉచితంగా కోచింగ్ ఇప్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం
- ఏడు నెలలుగా కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమం
- తాజాగా ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు కోచింగ్ ప్రారంభం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉన్నత విద్య అభ్యసించేందుకు గాను ఎంట్రెన్స్ పరీక్షలు రాసి ర్యాంకులు సాధించాలనే తపన ఉన్న చాలా మంది విద్యార్థులకు ఆర్థిక పరిస్థితి అనుకూలించదు. ఐఐటీ, నీట్, ఎంసెట్ వంటి పోటీ పరీక్షలకు కోచింగ్ తీసుకునేందుకు ప్రస్తుత పరిస్థితుల్లో రూ.లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పేద విద్యార్థులకు చేయూత అందిస్తున్నారు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి. వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ అందించేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఏడు నెలల క్రితం బాలికల, బాలుర జూనియర్ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం శిక్షణ చివరి దశలో ఉంది. తాజాగా జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఎస్‌ఐ, కానిస్టేబుల్, వీఆర్‌ఓ, టెట్ వంటి పోటీ పరీక్షలకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు 700 మంది అభ్యర్థులు శిక్షణ పొందేందుకు వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఇక పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ పరీక్ష కోసం సుమారు 150 మంది విద్యార్థులు స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో ఓ సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్నారు. వారికి ఉచితంగా భోజన సదుపాయాన్ని ఎమ్మెల్యే కల్పిస్తున్నారు. దీంతో ప్రైవేటు కోచింగ్ సెంటర్ల ఫీజుల భారం తగ్గిందని విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన కోచింగ్..

ఐఐటీ, నీట్, ఎంసెట్ కోచింగ్‌కు సంబంధించి సుమారు 150 మంది విద్యార్థులకు క్రాష్ కోర్సు నిర్వహిస్తున్నారు. అయితే విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించడంలో ఎలాంటి రాజీ లేకుండా కొన్నేళ్లుగా ఐఐటీ, నీట్ స్థాయిలో కోచింగ్ అందిస్తున్న రిషి, ప్రతిభ కళాశాలల అధ్యాపకులు ఇక్కడ బోధిస్తున్నారు. వీటితో పాటు మంచి స్టడీ మెటీరియల్స్, ప్రాక్టీస్ టెస్టులు, స్టడీ చైర్‌లు, పరీక్ష ప్యాడ్‌లు ఉచితంగా అందించారు. ఇక భోజన, వసతి సదుపాయం బాలికలకు జిల్లా కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో కల్పించారు. బాలురకు మెట్టుగడ్డ వద్ద ఉన్న ఎస్సీ హాస్టల్‌లో వసతి కల్పించారు. ఇక అంబేడ్కర్ కళాభవన్‌లో ఇస్తున్న కోచింగ్‌కు పలు ప్రఖ్యాత కోచింగ్ సెంటర్ల అధ్యాపకులను పిలిపించి ఇక్కడ శిక్షణ ఇప్పిస్తున్నారు. ఇందుకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

కోచింగ్ బాగుంది..



కొన్ని నెలలుగా ఇక్కడ శిక్షణ తీసుకుంటున్నా. ఏమైనా సందేహాలు ఉంటే వెంటనే నివృత్తి చేస్తున్నారు. మంచి స్టడీ మెటీరియల్ కూడా ఇవ్వడంతో చదువుకునేందుకు వీలుగా ఉంది. సీటు సాధించాలనే ఆశయంతో సెలవుల్లో కూడా ఇక్కడే ఉండి చదువుకుంటున్నాం.

– స్వాతి, ఎంసెట్ అభ్యర్థిని

అన్ని వసతులు ఉన్నాయి..



ఇక్కడ చదువుకునేందుకు అన్ని వసతులను ఎమ్మెల్యే కల్పించడం గొప్ప విషయం. ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు వెళ్లే పరిస్థితి లేని క్రమంలో ఇక్కడ చదువుకునేందుకు మంచి ప్లాట్‌ఫాం దొరికింది. స్టడీ మెటీరియల్స్, స్టడీ చైర్స్, హాస్టల్ వసతి అన్ని కల్పించారు. సీటు సాధించే విధంగా చదువుకుంటున్నాం.

– మహాలక్ష్మి, ఎంసెట్ అభ్యర్థిని

విజయ తీరాలకు చేర్చుతాం..



జిల్లాలో అనేక మంది విద్యార్థులకు చదవాలనే కోరిక ఉన్నప్పటికీ.. ఆర్థిక పరిస్థితుల కారణంగా వెనకడుగు వేస్తున్నారు. పేద విద్యార్థులకు చదువు భారం కావొద్దని ఉచితంగా ఐఐ టీ, నీట్, ఎంసెట్ కోచింగ్ ఇప్పిస్తున్నాం. వారికి భోజన వసతి కూడా కల్పిస్తున్నాం. నాణ్యతలో రాజీ లేకుండా ప్రైవేటు కోచింగ్ సెంటర్ల వారి సహకారంతో శిక్షణ ఇస్తున్నాం. ఉన్నతంగా ఎదగాలనే కోరిక ఉన్న విద్యార్థుల ను విజయతీరాలకు చేర్చేందుకు కృషి చేస్తున్నాం.

– యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే, మహబూబ్‌నగర్

రామేశ్వరం టు కాశీ

ప్రపంచ శాంతి కోసం పాదయాత్ర


పాదయాత్ర చేపట్టిన సోమ సుందరం బృందం

అడ్డాకుల: తమిళనాడు రాష్ట్రంలోని రామేశ్వరం ప్రాంతానికి చెందిన సోమసుందరం ఆధ్వర్యంలో 24 మంది సభ్యుల బృందం ప్రపంచ శాంతి కోరుతూ రామేశ్వరం నుంచి కాశీకి చేపట్టిన పాదయాత్ర చేపట్టారు. ఆ యాత్ర సోమవారం అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని 44వ నంబర్ జాతీయ రహదారిపై సాగింది. మూసాపేట వద్ద సంకల్పసిద్ధి హరిహర అయ్యప్ప క్షేత్రానికి చేరుకున్న పాదయాత్ర బృందం సభ్యులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పాదయాత్ర ప్రారంభించి 50 రోజులు కావడంతో వారు వెంట తెచ్చుకున్న మురుగస్వామి విగ్రహానికి ఆలయంలో పంచామృతాభిషేకాలు చేసి, భజనలు చేపట్టారు. పాదయాత్ర బృందానికి సంకల్పసిద్ధి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఇదిలా ఉండగా ప్రపంచ శాంతి కోసం ప్రతి ఏడేళ్లకు ఒకసారి రామేశ్వరం టు కాశీకి పాదయాత్ర చేస్తున్నట్లు సోమసుందరం తెలిపారు. 1983లో మొదటిసారి పాదయాత్ర ప్రారంభమైందని, ప్రస్తుతం ఏడో పాదయాత్ర సాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు తిరుపతయ్యగౌడ్, కొంగరి శ్రీనివాసులు, గూపని కొండయ్య, మిడ్జిల్ల విశ్వేశ్వర్, వాకిటి నరహరి, వెంకటాంపల్లి రాజు తదితరులు ఉన్నారు.

సోషల్ మీడియా, ఏఐపై అప్రమత్తంగా ఉండాలి

తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

కొల్లాపూర్: సంప్రదాయ మీడియా భవిష్యత్‌కు ప్రశ్నార్థకంగా మారిన సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)పై అప్రమత్తంగా ఉండాలని, దీనిపై త్వరలోనే హైదరాబాద్‌లో జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే.శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సోమవారం కొల్లాపూర్ మండలం సోమశిలలో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐ వల్ల భవిష్యత్‌లో మీడియా రంగంలో మానవ శక్తి అవసరం లేకుండా చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కల్పిత వార్తలు, కథనాలు, సమాచారాలతో సమాజాన్ని తప్పుదోవ పట్టించే ప్రమాదం పొంచి ఉందన్నారు. దీనిపై జర్నలిస్టులతో పాటు ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. గత ప్రభుత్వం రూపొందించిన అక్రిడిటేషన్ జీఓ అప్రజాస్వామికంగా ఉందని కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించడం వల్ల కొత్త అక్రిడిటేషన్ జారీ ఆలస్యమవుతోందన్నారు. అర్హులైన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు అవుతాయని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలు

ప్రభుత్వాలు ఏవైనా జర్నలిస్టుల పక్షపాతిగా, జర్నలిస్టుల సంక్షేమం కోసం 65 ఏళ్లుగా పోరాడుతున్న చరిత్ర ఐజేయూదని స్టీరింగ్ కమిటీ సభ్యుడు దేవులపల్లి అమర్ అన్నారు. ఉద్యమాలతోనే జర్నలిస్టుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సంఘ నాయకులకు ప్రభుత్వ పదవులు వచ్చినంత మాత్రాన, సంఘ ప్రయోజనాలు, పదవుల బాధ్యతలు వేరుగా ఉంటాయని వివరించారు. టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్‌అలీ మాట్లాడుతూ జర్నలిస్టుల ప్రధాన సమస్యలైన ఇళ్ల స్థలాలు, హెల్త్‌కార్డులు, అక్రిడిటేషన్ కార్డులు, ఉచిత విద్య అంశాలపై కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, నగునూరి శేఖర్, కె.రాములు, బుర్ర సంపత్‌కుమార్ గౌడ్, గాడిపల్లి మధుగౌడ్, ఫైజల్ అహ్మద్, మధుగౌడ్, యాదగిరి, శ్రీకాంత్‌రెడ్డి, మోతే వెంకటరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

59 రోజులైనా లభించని కార్మికుల ఆచూకీ

- ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలు


సొరంగంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

అచ్చంపేట: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో 59 రోజులుగా సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నా.. గల్లంతైన ఆరుగురి కార్మికుల జాడ లభించడం లేదు. 13.936 కి.మీ. వద్ద కంచె ఏర్పాటు చేసిన నిషేధిత డీ–1 ప్రదేశంలో 43 మీటర్లు మినహా మిగతా ప్రాంతంలో టీబీఎం ప్లాట్‌ఫాం భాగాలతో పాటు మట్టి, బురద, బండరాళ్లను తొలగించి బయటికి తరలిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన సుమారు 450 మంది రెస్క్యూ సిబ్బంది సహాయక చర్యలు చేపడుతున్నారు. పైకప్పు కూలిన ప్రదేశంలో పేరుకుపోయిన శిథిలాలను తొలగిస్తే.. మరింత ప్రమాదం జరిగే అవకాశం ఉందని జీఎస్‌ఐ సర్వే విభాగం తేల్చిచెప్పడంతో అక్కడ ఇప్పట్లో పనులు చేపట్టే అవకాశం లేదు. సొరంగంలో ఏర్పడిన గండి నుంచి ఉబికి వస్తున్న నీటి ఊటను భారీ మోటార్ల సాయంతో బయటకు పంపింగ్ చేస్తున్నారు. సహాయక చర్యలు పూర్తయిన తర్వాత నీటిఊటను అలాగే వదిలేస్తే.. నిషేధిత ప్రాంతం మరింత బురదగా మారుతుందని రెస్క్యూ సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. ప్రమాద ప్రదేశం నుంచి 324 మీటర్ల వరకు శిథిలాలు పేరుకుపోయి ఉండగా.. ఇప్పటి వరకు 281 మీటర్ల మేర మట్టి, బురద, బండరాళ్లు, టీబీఎం ప్లాట్‌ఫాం భాగాలను తొలగించారు. 13.850 కి.మీ. నుంచి 13.936 కి.మీ. మధ్య సొరంగం పైకప్పు కూలిన ప్రదేశం క్రిటికల్ జోన్‌గా గుర్తించారు. 43 మీటర్ల వద్ద గల్లంతైన ఆరుగురి కార్మికులు ఉండవచ్చని భావిస్తున్నారు.

టెక్నికల్ కమిటీ అధ్యయనం తర్వాతే..

ప్రభుత్వం 11 మంది ఉన్నతాధికారులతో ఏర్పాటుచేసిన టెక్నికల్ కమిటీ సొరంగం కూలిన ప్రదేశం పరిస్థితులపై అధ్యయనం చేసిన తర్వాతే నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వీరు ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం పనులు చేపట్టాలా.. వద్దా? అనే విషయంపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. 13.500 కి.మీ. నుంచి 15 కి.మీ. వరకు భూభాగం పొరల మధ్య నీటిఊట ఉన్నట్లు జియోలజికల్ సర్వే ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఇన్‌లెట్ వైపు నుంచి సొరంగం తవ్వకాలు చేపట్టడం కష్టతరమని.. డ్రిల్లింగ్ లేదా బ్లాస్టింగ్ విధానం తప్ప మరో మార్గం లేదని తేల్చడంతో రాష్ట్ర ప్రభుత్వం డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టరింగ్ విధానం అనుసరించాలని భావిస్తోంది. ఇందుకోసం కేంద్ర అటవీ, పర్యావరణశాఖల నుంచి అనుమతి కోరుతూ లేఖ రాయనున్నట్లు తెలిసింది. సహాయక చర్యల్లో సింగరేణి మైన్స్ రెస్క్యూ బృందం మేనేజర్లు రాజేందర్‌రెడ్డి, మాధవరావు, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్, హైడ్రా, ఆర్మీ, దక్షిణమధ్య రైల్వే, ర్యాట్ హోల్ మైనర్స్, ఇరిగేషన్, జేపీ కంపెనీ వంటి 12 రకాల విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారు.

వికసించిన అరుదైన పుష్పం


పుష్పించిన బ్రాకిస్టెల్మా బైలోబేటమ్ పుష్పం

జడ్చర్ల టౌన్: పట్టణంలోని డాక్టర్ బీఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల బొటానికల్ గార్డెన్‌లో అత్యంత అరుదైన బ్రాకిస్టెల్మా బైలోబేటమ్ పుష్పించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ జి.సుకన్య తెలిపారు. ఈ మొక్కను గార్డెన్ సమన్వయకర్త డా.సదాశివయ్య, ఢిల్లీలోని శ్రీవెంకటేశ్వర కళాశాల వృక్షశాస్త్ర సహాయ ఆచార్యుడు డా.ప్రసాద్ 2020లో కనుక్కొని బ్రాకిస్టెల్మా బైలోబేటమ్ అని నామకరణం చేశారన్నారు. ఇవి కేవలం నల్లమల అటవీ ప్రాంతంలోనే లభ్యమవుతాయని.. ప్రపంచంలో మరెక్కడ లభ్యం కావన్నారు. సన్నని కాండంతో 25 సెం.మీ. వరకు మొక్క పెరుగుతుందని.. ప్రతి కనుపు వద్ద తెల్లని కేశాలుగల రెండు ముదురు ఎరుపు, నల్లని పుష్పాలు ఇస్తుందని గార్డెన్ సమన్వయకర్త డా. సదాశివయ్య తెలిపారు. భూమిలోపల దుంప కలిగిన ఈ మొక్క తొలకరి వర్షాలు పడగానే ముందుగా పొడవాటి కాండాన్ని ఇచ్చి పుష్పిస్తుందని.. ఆ తర్వాత ఆకులు ఇవ్వడం దీన్ని ప్రత్యేకత అని ఆయన చెప్పారు. బ్రాకిస్టెల్మా దుంపలను జలుబు, తలనొప్పి, రొమ్ము నొప్పులకు మందుగా వినియోగిస్తుంటారన్నారు. దుంపల ఔషధ గుణాలపై లోతైన పరిశోధనలు జరగాల్సి ఉందన్నారు. ఇలాంటి అరుదైన మొక్క గార్డెన్‌లో పుష్పించడం ఇదే మొదటిసారి అని.. ఇలాంటి అరుదైన మొక్కలను కాపాడటమే గార్డెన్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు.

కల్తీ ఆహారం విక్రయిస్తే కఠిన చర్యలు


ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చికెన్‌ను పరిశీలిస్తున్న జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్

జడ్చర్ల: హోటళ్లు, రెస్టారెంట్లలో వినియోగదారులకు నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలని.. కల్తీ ఆహారం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మనోజ్ హెచ్చరించారు. సోమవారం జడ్చర్లలో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లతో పాటు పాల విక్రయ కేంద్రాలను తనిఖీ చేశారు. రెండు రోజుల క్రితం ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చికెన్ దుర్వాసన రావడంతో వినియోగదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. సెంటర్‌లోని బిర్యానీ తదితర వంట పదార్థాలను పరిశీలించగా.. చికెన్‌లో బొద్దింక కనిపించింది. దీన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో హల్‌చల్ అయ్యింది. వెంటనే స్థానిక మున్సిపల్ అధికారులు స్పందించి సదరు ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో తనిఖీలు చేపట్టి రూ. 5వేల జరిమానా విధించారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆహార భద్రత అధికారి మనోజ్ తనిఖీలు చేపట్టారు. తాజ్ ఫుడ్ కోర్టుతో పాటు ఇతర ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లను పరిశీలించారు. వంటశాలలు, చికెన్ బిర్యానీ తదితర ఆహార పదార్థాలను ఆయన పరిశీలించి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్‌లో నాణ్యత ప్రమాణాలు తగ్గినట్లు తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదే విధంగా పాల విక్రయ కేంద్రాల్లో కల్తీ జరిగినట్లు రుజువు అయితే చర్యలు తప్పవన్నారు. కాగా, ఇంతకు ముందు కూడా కొత్త బస్టాండ్ సమీపంలోని గజ ఫుడ్‌కోర్టులో బిర్యానీలో బొద్దింక వచ్చింది. వినయోగదారుడి ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు చేపట్టారని.. మిగతా అన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాల్లో తనిఖీలు చేయాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా ఫాస్ట్ ఫుడ్ సెంటర్ నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు.

ఫెయిల్ అవుతానేమోనన్న భయం..

- పురుగు మందు తాగిన ఇంటర్ విద్యార్థి
- చికిత్స పొందుతూ మృతి

మల్దకల్: ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించలేనని భయంతో ఓ విద్యార్థి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. మల్దకల్ మండలం మల్లెందొడ్డి గ్రామానికి చెందిన వీరన్న, సత్యమ్మల కుమారుడు బోయ వినోద్(18) గద్వాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివాడు. ఇటీవల పరీక్షలు ముగియగా... తాను ఉత్తీర్ణత సాధించలేనేమోనని స్నేహితులు, కుటుంబసభ్యులతో వాపోయాడు. అదే భయంతో ఈ నెల 9వ తేదీన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు గద్వాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి.. అక్కడి నుంచి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ గోపాల్ నాయక్ తెలిపారు.

గోడ కూలి వలస కూలీ మృతి

- భార్యకు తీవ్ర గాయాలు


రాంరెడ్డి (ఫైల్)

కొత్తపల్లి: బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో భవన నిర్మాణ కూలీగా పనిచేస్తున్న కొత్తపల్లి మండలంలోని భూనీడు గ్రామానికి చెందిన శివనోళ్ల రాంరెడ్డి (50) మృతి చెందిన ఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భూనీడు గ్రామానికి చెందిన శివనోళ్ల రాంరెడ్డి ఆయన భార్య అనురాధతో కలిసి ఐదేళ్లుగా హైదరాబాద్‌లోని బుద్వేల్‌లో అద్దె ఇంట్లో ఉంటూ రోజువారీ కూలీగా జీవనం కొనసాగిస్తున్నాడు. ఆదివారం భవన నిర్మాణ పనులు చేస్తుండగా.. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఒక్కసారిగా గోడ కూలి పని చేస్తున్న ఐదుగురు కూలీలపై పడింది. ఈ ఘటనలో గాయపడ్డ కూలీలను ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన భూనీడు గ్రామానికి చెందని రాంరెడ్డి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. అక్కడే పనిచేస్తున్న మృతుడి భార్య అనురాధకు కాలు విరిగినట్లు గ్రామస్తులు తెలిపారు. సోమవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గ్రామానికి తీసుకొచ్చారు. మృతుడికి 12 ఏళ్ల కుమారుడు ఉన్నాడు.

దేవరగుట్టలోనే చిరుతలు

నవాబుపేట: ఈ గుట్ట నాదే.. ఈ ప్రాంతం నాదే.. అనే చిరుత సినిమాలోని డైలాగ్ తరహాలో నవాబుపేట మండలం యన్మన్‌గండ్ల దేవరగుట్టపై చిరుతలు తిష్ట వేశాయి. సోమవారం గుట్ట పైభాగంలో ఓ చిరుత దర్జాగా కూర్చుని కనిపించింది. కాగా, గుట్టను ఆవాసంగా చేసుకున్న రెండు చిరుతలను బంధించేందుకు అటవీశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. నాలుగు రోజుల క్రితం గుట్టపై సీసీ కెమెరాలతో పాటు బోన్ ఏర్పాటు చేసినప్పటికీ చిరుతలు చిక్కడం లేదు. దేవరగుట్టలోనే చిరుతలు ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సీసీ నిఘా మధ్య చిరుతలకు అటవీశాఖ అధికారులు గస్తీ ఏర్పాటు చేసినట్టుగా చిరుతల తీరు ఉందని చర్చించుకుంటున్నారు.


యన్మన్‌గండ్ల దేవరగుట్టపై ఉన్న చిరుత

బాలికపై అత్యాచారం

- నిందితుడికి 14 రోజుల రిమాండ్

మద్దూరు: మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి అత్యాచారం చేసిన వ్యక్తిని పోలీసులు పట్టుకొని కోర్టులో హాజరుపర్చగా మెజిస్ట్రేట్ నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించినట్లు కోస్గి సీఐ సైదులు సోమవారం తెలిపారు. సీఐ కథనం మేరకు.. దామరగిద్ద మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (17) మద్దూర్‌లో కంప్యూటర్ కోర్సు చేస్తోంది. దామరగిద్ద మండలానికి చెందిన బోయిని శ్రీనివాస్ (24) ఈ నెల 10న బాలికకు మాయ మాటలు చెప్పి తన ద్విచక్ర వాహనంపై హైదరాబాద్‌కు తీసుకెళ్లాడు. అక్కడే ఓ కిరాయి రూంలో బాలికపై అత్యాచారం చేసి మరుసటి రోజు మద్దూరు బస్టాండ్‌లో వదిలిపెట్టాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడిని పట్టుకొని సోమవారం కోస్గి న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు. ఈ మేరకు మెజిస్ట్రేట్ నిందితుడికి 14 రోజుల రిమాండ్ విధించగా.. మహబూబ్‌నగర్ సబ్ జైలుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

చెక్ బౌన్స్ కేసులో ఆరునెలల జైలుశిక్ష



ఖమ్మం లీగల్: మహబూబ్‌నగర్‌కు చెందిన కుమ్మరి శేఖర్‌కు చెల్లని చెక్కు కేసులో ఆరు నెలల జైలు శిక్ష విధించడమే కాక ఫిర్యాదుదారుడికి రూ.7లక్షల పరిహారం చెల్లించాలని ఖమ్మం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కాసరగడ్డ దీప సోమవారం తీర్పు చెప్పారు. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం గోకినేపల్లికి చెందిన వరికల వెంకటేశ్వరరావు వద్ద శేఖర్ రెండు దఫాలుగా రూ.5 లక్షల అప్పు తీసుకున్నాడు. తిరిగి చెల్లించే క్రమంలో 2018 డిసెంబర్‌లో రూ.7 లక్షలకు చెక్కు ఇచ్చాడు. కానీ ఆయన ఖాతాలో సరిపడా నగదు లేక చెక్కు తిరస్కరణకు గురైంది. ఈ మేరకు వెంకటేశ్వరరావు తన న్యాయవాది ద్వారా లీగల్ నోటీస్ జారీ చేసి కోర్టులో ప్రైవేటు కేసు దాఖలు చేశారు. కేసు విచారణ అనంతరం శేఖర్‌కు జైలుశిక్ష విధించడంతో పాటు ఫిర్యాదికి రూ.7లక్షలు చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.